# నిజం నిప్పులాగ

ఆ దృశ్యం చూసి సోమనాథన్ కన్నులు గుచ్చుకున్నాయి. పరమహంస, వివేకానందా రెండు పక్కలా కనిపిస్తున్నారు, ఆ వరుసలో తన పటమా? ముఖం చిట్లించుకొని, కళ్ళద్దాలని బాగా ఎత్తి, లేచి గోడ దగ్గరకి వెళ్ళి బాగా పరిశీలించారు.

అప్పుడు లోపలికి హార్లిక్స్ తయారు చెయ్యడానికి వెళ్ళిన అతని మేనకోడలు కోదై చెయిలో cup and saucer తో హాలుకి వచ్చింది. సోమనాథన్ ఆమెను తిరిగి చూసారు.

"ఇది ఎవరి పని?" అని తన పటాన్ని చేతి వేలుతో చూపుతూ అడిగారు.

చెయిలోనిది టీపాయిమీద పెట్టి అతని పక్కన నిలబడి ఆ పటాల్ని చూసి కోదై మాట్లాడింది: " నేను ఈ ఇంటికి రావడానికి ముందే అది అక్కడ ఉంది. తను ఆరాధించే మేధావులు వీరు అని మా వారు అందరికి పరిచయం చేస్తారు. నా దగ్గర కూడా అలాగే చెప్పారు, . . ." అని ఆమె చెప్తూంటే సోమనాథన్ కళ్ళద్దాలని తీసి తను కప్పుకున్న శాలువలో తుడుచుకుంటూ గిలి గిలి నవ్వులతో పలికారు: "ఎంత విచిత్రమైన కలయిక! ఈ ఆస్తిక మహనీయుల మధ్య నిరీశ్వరుడైనా నా పటమా?" అని గొణుక్కుంటూ ముంజెయ్యిలో ఉన్న చేతి కఱ్ఱను కుడి చెయిలో మార్చుకొని మెల్లగా నడచి సోఫా మీద కూర్చున్నారు.

కోదై అతనికి హార్లిక్స్ అందించింది. వృధ్యాప్యంలో నీరసించిన చేతులు ఒణుకుతూ అతను దాన్ని తాగారు. ఆ వేడి పానీయం తాగడంతో అతని నుదుట చెమట పోవడం గమనించి కోదై electric fan మీట నొక్కింది. వెంటనే ఆ గాలిలో తల నెరిసి గుబురుగా పెరిగిన అతని జుత్తు నుదుట మీద దొర్లాడింది. సోమనాథన్ చూపు ఆ హాలు చుట్టూ వ్యాపించి అక్కడ ఉన్న రేడియో; ఆ మూలను అలంకరిస్తున్న బుద్ధుని విగ్రహం; కిటికీలను మూసిన నీల రంగు తెర; ఆఖరికి కోదై ముఖంపై స్థిరపడింది. అతని కళ్ళలో అనురాగంతో ఒక పసిపాప లాగ అతను చిరునవ్వు నవ్వారు.

ఆ చిరునవ్వుకి అర్థం, 'అమ్మాయీ, నువ్వు చాలా బుద్ధిమంతురాలివి, ఈ ఇంటిని ఎంత చక్కగా చూసుకుంటున్నావు,' అని పొగడుతున్నట్టు, 'నువ్వు ఎలాగ ఉన్నావు?' అని అడుగుతున్నట్టు, 'నిన్ను చూసి నాకు చాలా తృప్తిగా ఉంది,' అని గర్వపడుతున్నట్టు ఉంది.

అన్ని అర్థాలకీ జవాబు చెప్తున్నట్టు కోదై కూడా అణకువతో ఒక చిరునవ్వు నవ్వింది. సోమనాథన్ తన వాచీ చూస్తూ " ఓ, టైము ఐదు గంటలు అవబోతుందే, అతను కాలేజినుంచి రావడానికి ఇంత ఆలస్యమా? నాకు ఏడు గంటలకి ట్రెయిన్ . . " అని అంటూ బయటకు తల వంచి చూసారు.

అదే సమయం ఎవరో కాంపవుండు గేటు తెరిచే సందడి విని కోదై ఆత్రుతతో బయటకి వెళ్ళింది. పరమేశ్వరన్ని రెండు చేతులతో కౌగిలించుకోడానికి తొందరగా సోమనాథన్ లేచి నిలబడ్డారు.

" అతను కాదు, పోస్టుమేన్ .. అతనికి ఏదో ఉత్తరం వచ్చింది .." అని చెప్పి దాన్ని పదే పదే చూస్తూ కోద్దై లోపలికి వెళ్ళింది. సోమనాధన్ పక్కనే ఉన్న ఫోటో ఆల్బం చూసుకుంటూ పరమేశ్వరన్ని ఎదురుచూస్తున్నారు.

*****

పరమేశ్వరన్ ప్రస్తుతం తమిళ ప్రొఫెసరుగా పని చేస్తున్న అదే కాలేజీలోనే పది సంవత్సరాల ముందు సోమనాధన్ ఇంగ్లీషు ప్రొఫెసరుగా ఉద్యోగం చేసారు. అతని దగ్గర విద్యార్థిగా చదివి అతను రిటైరు అవడానికి ముందే అదే కాలేజిలో పరమేశ్వరన్ ఒక లెక్చరర్ గా చేరే ఆ ఎడబాటులో వాళ్ళ ఇద్దరి మధ్య మంచి స్నేహమూ, బంధమూ ఏర్పడ్డాయి.

సోమనాధన్ పదవీవిరామణతో తన సొంత ఊరుకి తిరిగి వెళ్ళిన తరువాతకూడా వాళ్ళ ఇద్దరి మధ్య అన్యోన్యత కొన్ని సమయాల్లో తపాలు మూలంగా జరిగింది. రెండు సంవత్సరాలముందు సోమనాధన్ ఏదో పని మీద చెన్నై వచ్చినప్పుడు పది సంవత్సరాల తరువాత వాళ్ళు కలుసుకున్నారు. పరమేశ్వరన్ని చూడగానే సోమనాధన్ ఒక క్షణం ఉలికి పడ్డారు: దానికి కారణం విద్యార్థిగా ఉండి లెక్చరర్ గా అతనికి లభించిన పదోన్నతి మాత్రమే కాదు; ఒక బుష్ కోటు, కళ్ళద్దాలు, చెవుల తమ్మెలలో నెరిసిన జుత్తు - వీటితో తను ఎదురుచూడని పరమేశ్వరన్ ఆకారం. అంతకన్నా ముఖ్యమైన కారణం నలభై సంవత్సరాలు నిండినా పరమేశ్వరన్ ఒక బ్రహ్మచారిగా జీవించడం.

తన అభిమానం, మర్యాద కి అర్హులైన గురువుని చూడగానే పరమేశ్వరన్ అతని చెయిని పట్టుకొని కళ్ళలో ఒత్తుకున్నారు. సోమనాధన్ అనురాగంతో పరమేశ్వరన్ వీపుని మెల్లగా తట్టి, పలికారు: "మీ బ్రహ్మచారి జీవితం చూసి నాకు నానగా ఉంది. దానికి అర్థం లేదంటారా మీరు?" అని అడిగారు.

సోమనాధన్ ఎప్పుడైనా సరే మొహమాటం లేకుండా తన అభిప్రాయం ఇతరులకు చెప్తారు. అంతేకాదు, దానితో అతను ఆగరు. ఎవరి దగ్గర తన అభిప్రాయం చెప్పారో వాళ్ళు కూడా తను చెప్పినది అంగీకరించాలని లేక రాజీ పడాలని ఎదురు చూస్తారు. ఇది అతనిలో ఉన్న ఒక ఉత్తమ గుణం.

పరమేశ్వరన్ కి తల్లి తండ్రులో లేక సన్నిహిత బంధువులో ఎవరూ లేరు. అతను ఒక ఏకాంత జీవి. అటువంటి వ్యక్తికి పెళ్ళి అనే ఒక సంఘటన జరగాలంటే అందుకు బాధ్యత, అంతస్తు కల మిత్రుల ఆదరణ కావాలి. అది అటువంటి మిత్రులూ, మార్గదర్శి ఐన సోమనాధన్ ధర్మం కదా? అవన్నీ ఆలోచించే సోమనాధన్ తన్ను అడుగుతున్నారని పరమేశ్వరన్ కి బోధపడింది.

" ఏం, బ్రహ్మచర్యం ఒక నేరమా?" అని నవ్వుతూ అతను అడిగారు.

"అది నేరం కాదు, ఐతే ఉచితమైన జీవితమూ కాదు. ఎటువంటి వికలత లేని ఒక పురుషుడు బ్రహ్మచర్యం అనుష్టించాలంటే అందుకు ఒక లక్ష్యం కావాలి. అప్పుడే బ్రహ్మచర్యం ఒక సన్మార్గ జీవితం అవుతుంది. అలాగ కాకుండా బ్రహ్మచర్యంకోసమే ఒక పురుషుడు బ్రహ్మచారిగా ఉంటే అది సరైన పని

కాదు; తదంతరం అది నేరం కూడా కావచ్చు. మనం ఎది చేసినా దానికి ఒక గురి ఉండాలి, లేకపోతే దానికి పేరు అనర్థం! మీ బ్రహ్మచర్యం కి ఒక అర్థం ఉందంటే నేను నా అభిప్రాయం మార్చుకుంటాను," అని అన్నారు సోమనాధన్.

పరమేశ్వరన్ ఒక క్షణం ఆలోచించారు; అది ఆలోచన కాదు, ఒక విధమైన దిగ్భ్రమ; తరువాత ఒక చిరునవ్వు. అది చిరునవ్వు కాదు, ఒక విధమైన శరణాగతి,

ఆ కలయిక తరువాత వారిద్దరు చాలా సేపు మాట్లాడారు. పది సంవత్సరాల ముందు పరమేశ్వరన్ తన గురువుని ఎంత బాగా అర్థం చేసుకున్నారో దానికంటే ఈ పదిసంవత్సరాల ఎడబాటులో తమ అనుభవం, పరిపక్వత వలన ఇంకా బాగా అర్థం చేసుకొని అతని దగ్గర పూర్తిగా శరణు కోరారు.

పరమేశ్వరన్ దగ్గర సెలవు పుచ్చుకొని తన గ్రామానికి తిరిగి వెళ్ళేముందు సోమనాధన్ అతన్ని తన ఊరుకి ఆహ్వానిచారు.

"ఇది నా ధర్మం అని భావించి నా ఊరుకి మీరు రావాలంటున్నాను. చిన్న వయసులోనుంచే తల్లీ తండ్రీ ఎరుగని నా మేనకోడలు నా సం రక్షణలో ఉంది. అది కూడా తనకు పెళ్ళి వద్దు అని అనేది, కాని ఇప్పుడు దాని మనసు మారినట్లుంది. ఏదైనా సరే, మీరు ఒకసారి మా ఊరుకు రండి. పరస్పరం ఇష్టముంటే ఈ పెళ్ళికి ఏర్పాడు చెయ్యడం నా బాధ్యత." తన కుల గోత్రాలు ఏమీ అడక్కుండానే ఒక మిత్రుని స్నేహమూ, గుణమూ ముఖ్యమని భావించి ఆ పెళ్ళి గురించి మాట్లాడుతున్న సోమనాధన్ని పరమేశ్వరన్ కొనియాడారు,

రెండు సంవత్సరాల ముందు ఆ పెళ్ళి జరిగింది. పెళ్ళికి ముందు పరమేశ్వరన్ ఒక సంగతి గురించి బాధ పడ్డారు: అదేమంటే అప్పుడు కోదైకి వయసు ఇరవై. పరమేశ్వరన్ కి నలభై.

పరమేశ్వరన్ జంకు చూసి సోమనాధన్ అతనికి " వయసులో ఇంత తేడా ఉండకూడదు అంటే అది మీ సొంత అభిప్రాయం. దానికి మించి ఏమైనా కారణం ఉన్నా సరే అది మీ ఇష్టం. ఆఖరికి మీరే ఆలోచించి దీనికి తీర్పు చెప్పాలి," అని అన్నారు.

ఖరారుగా ఏం చెప్పాలో పరమేశ్వరన్ కి తెలియలేదు. సోమనాధన్ తన్ను నిర్బంధించడం లేదు; తను అతని సలహా నిరాకరిస్తేకూడా అతను తప్పార్థం చేసుకోరు. అందువలనే అతనికి ఏం చెయ్యడమా అనే ఆరాటం కలిగింది.

పరమేశ్వరన్ కి మనసులో ఉండే అంగీకారమూ, బయట కనిపించే బెరుకూ అర్థం చేసుకున్న సోమనాధన్ నిదానంగా అడిగారు: " అసలు మీ మొహమాటం ఎందువలన అని చెప్తారా?' అని అడిగారు.

పరమేశ్వరన్ - తన నలభై ఏళ్ళ వయసు మరిచి - ఒక యువకునిలాగ సిగ్గుతో జవాబు చెప్పారు:
" మా వయసులోని తేడావే . . ."

"ఓ, అలాగా?" అని అంటూ సోమనాథన్ నవ్వారు. "నేను ముందే చెప్పానుగా? ఆ తేడా ఎక్కువ అని అనిపిస్తే మీరు ఈ ప్రయత్నం వదిలేయండి. కాని మీ మనసుకి ఇష్టమై ఇతరులు ఏమంటారో అని మీరు బాధపడడంలో ఎటువంటి అర్థమూ లేదు, అది మంచిదీ కాదు . . ."

"మరి ఈ ప్రపంచం ఎలా వుందని కొంచం చూడాలికదా?" అని అరచెయిలో గీటుకుంటూ పరమేశ్వరన్ అడిగారు.

"నిజమే, కొంచం ఎందుకు ఇంకా బాగానే, పూర్తిగా మనం ప్రపంచాన్ని గమనించాలి. కాని, పరమేశ్వరన్, ప్రపంచమనేది మన చుట్టుపక్కల ఉండే ఒక చిన్న వర్గం మాత్రం కాదు. అది ఖండాలు ఖండాలుగా, దేశదేశాలుగా వ్యాపించి ఉంది. ఇంకా చెప్పాలంటే మీరు చెప్పే ఈ వయసు తేడాకి ఆ ప్రాంతాల్లో ఎటువంటి ముఖ్యతా లేదు. మీ అనుకూలంకోసం ఈ ప్రపంచాన్ని కుదుటపరుచుకోవాలంటే - అది ఈ పొల్లు కబర్లు చెప్పే ప్రపంచం అని అనుకోకండి. మీ దగ్గరే మీ హృదయం పక్కనే ఉండే ప్రపంచం ఏం చెప్తుంతో వినండి తరువాత ఏం చేయాలో ఆలోచించండి." అని చెప్పి సోమనాథన్ ఏదో ఆలోచనలో పడ్డారు.

'ఇతను చాలా అద్భుతంగా ఇంకొకరి మనసులో దూరి ఎంత దీర్ఘంగా పరీక్ష చేస్తున్నారు!' అని పరమేశ్వరన్ ఆశ్చర్యపడ్డారు.

కన్నులు తెరవకుండానే సోమనాథన్ మళ్ళీ మాట్లాడారు: "ఒక మగవాడు పెళ్ళి చేసుకున్నప్పుడు అది తనకోసమే అని భావిస్తాడు; ఒక ఆడది కూడా అదే మనోభావంతో పెళ్ళికి ఒప్పుకుంటుంది. తన మేలు మాత్రమే చూసుకొని చేసే ఏ పని ఐనా దాని వలన ఆఖరికి అసంతృప్తి కలుగుతుంది. వివాహానికి అసలు తాత్పర్యం ఏమిటి? ఒక స్త్రీ లేక పురుషుడు తనకోసం జీవించడం ఆపి ఇంకొక జీవికోసం జీవితం ప్రారంభించడం. మానవ జీవితంలో పెళ్ళి ఒక ప్రధానమైన ఘట్టం. ఒకరికోసం ఇంకొకరు త్యాగం చెయ్యడం వలనే సమాజం ప్రకాశవంతంగా వర్ధిల్లుతుంది, ధగధగలాడుతుంది. అంతేకాని 'నా కోసం, నా సుఖంకోసం,' అనే వంకలో ఒక ఆడ మగ సంపర్కం ఏర్పడితే ఆ ప్రత్యేక వ్యక్తి జీవితం, ఆ సమాజం రెండూ వ్యర్థమవుతాయి. ఇప్పుడు మీరు చేసుకొనే వివాహం మీ కోసం కాదు, ఆమె కోసం. నేను ఇదే మాట నా మేనకోడలికి కూడా చెప్పాను . . . దాంపత్యానికి ప్రధానమే ఈ పరస్పర నిబద్ధత అని మీరు ఒప్పుకుంటుంటారా?"

పరమేశ్వరన్ ఒక క్షణం ఆలోచించారు; అది ఆలోచన మాత్రం కాదు . . .

ఈ రెండు సంవత్సరాల దాంపత్యంలో అతను తన జీవితాన్ని బాగా అర్థం చేసుకున్నారు. కోధై లేకుండా తను ఇక జీవితం గడపలేను అనే భావన అతనిలో రూపొందింది. తన్ను ఒక చెక్కు చెదరని మనిషిగా మార్చినది సోమనాథన్, తన జీవితానికి ఒక లక్ష్యం ఇచ్చినది కోధై అనే తలపుతో పరమేశ్వరన్ సోమనాథన్ని గౌరవార్హమైన తన మార్గదర్శిగాను, కోధైని తన అమూల్యమైన ప్రాణనాయకిగాను కొనియాడారు.

తన దాంపత్యం పరస్పర ప్రేమ, అనుభూతితో సాగడం, తమ తమ వయసులోని తేడా గురించి పరమేశ్వరన్ ఒక రోజు కోదైతో మాట్లాడారు. ఆమె చెప్పిన జవాబు విని అతను ఆమె స్వభావం గ్రహించుకున్నారు.

ఆ మెరుపు తగ్గిన వెలుతురులో పడకగదిలో భార్యా భర్తలు ఒంటరిగా ఉన్నప్పుడు కోదై అతని మీద వాలి అతని వక్షంపై ఏమో రాస్తూ  తన చెవిలో చెప్పిన మాటలు విని అతని వెండ్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

"నాకూ మీలాగే అటువంటి తాపత్రయం ఉండేది. కాని ఇప్పుడేమో అందరూ మనలాగే వయసు తేడాతో పెళ్ళి చేసుకుంటే వాళ్ళ జీవితం కూడా స్వర్గలోకం లా అవుతుందని అనిపిస్తోంది. దంపతులు ఒక వయసులో ఉంటే వాళ్ళలో ఐక్యత, రాజీ పడడం అంత సులభం కాదేమో . . ఈ వయసు తేడా . . . నాకు మరేం చెప్పాలో తెలియటం లేదు . . .నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. అంతకంటే మరేం చెప్పాలో నాకు తెలియదు, . . ." అని అతని ప్రశ్నకి కోదై తడబడుతూ జవాబు చెప్తూంటే పరమేశ్వరన్ హృదయం విశాలమై ఆనందించింది.

****

కాష్మీరు మడుగులనుంచి కన్యాకుమారి సముద్రం వరకూ ఆ దంపతులు కలసి ఆనందించిన దృశ్యాలు ఆ ఆల్బంలో చూసి వారి ఆనందమైన కుటుంబం సోమనాధంకి బోధపడింది.

ఆల్బంలో ఆఖరి ఫోటో చూసి దాన్ని మూసినప్పుడే తన ఎదుట నిలబడి " మీరు ఎప్పుడు వచ్చేరు?" అని అడిగే పరమేశ్వరన్ని ద్వారం దగ్గర గమనించి, రెండు చేతులూ చాపి, సోమనాధన్ పసిపాపలాగ నవ్వారు. తరువాత పక్కనే వచ్చి కర చాలనం చేసి బుజాన మెల్లిగా తట్టారు.

" ఉన్నట్టుండి ఒక పని మీద వచ్చాను, ఇప్పుడు ఏడు గంటల ట్రెయినులో తిరిగి వెళ్ళాలి," అని అతను చెప్పగానే పరమేస్వరన్ ముఖం చిన్నబోయింది. " ఇప్పుడే టైము ఐదున్నర ఐపోయింది. సరే, నేనూ మీతో స్టేషన్ వరకూ వస్తాను," అని చెప్పి పరమేశ్వరన్ తన వాచీని చూసుకున్నారు.

" అలాగే, ఏం తొందర? ఇంకా గంటన్నర టైముంది . . మీరు బట్టలు మార్చుకొని కాఫీ తాగండి."

ఆ ఉన్న సమయంకూడా వ్యర్థం చెయ్యడానికి మనసొప్పక పరమేశ్వరన్ హాలులో నిలబడి కోటు విప్పారు. అతని పక్కనే సిద్ధంగా నిలబడి ఉన్న కోదై దాన్ని తీసుకొని లోపలికి వెళ్ళింది. తిరిగి వచ్చినప్పుడు ఒక తువ్వాలుతో వచ్చింది. దాన్ని బుజాన వేసుకొని సోఫాలో కూర్చొని బూట్సు విప్పుతున్న పరమేశ్వరన్ తో ఆ గోడమీది పటాల్ని చూస్తూ సోమనాధన్ పలికారు: " ఈ విచిత్రమైన కలయిక చూసి నాకు తమాషాగా ఉంది."

పరమేశ్వరన్ తల ఎత్తి చూసారు: " ఇందులో ఏం తమాషా? ఒకతను నాకు దేవునిపై నమ్మకం, భక్తి కలిగించారు; ఇంకొకరు బ్రమ్మచర్యంలోని అర్థం నాకు బోధపరిచి జీవితానికి మార్గదర్శిగా ఉన్నారు.

తల్లి తండ్రులు లేని నాకు మీరు ఇద్దరు గురువులు. నా తల్లి తండ్రుల పటం లేని కొరత మీ పటం మూలంగా నాకు తీరింది. ఈ ముగ్గురూ నా అభిమానంకీ, మర్యాదకీ, అర్హులైన జ్ఞానులు."

"Oh, that's too much! మీరు నన్ను ఎక్కువగా పొగడుతున్నారు," అని సోమనాథన్ అణకువతో నవ్వారు.

"కాదు, నేను మిమ్మల్ని అణకువతో ఆరాధిస్తున్నాను," అని చెప్పి పరమేశ్వరన్ మర్యాదతో నిలబడ్డారు.

" ఆరాధనా? అందులో నాకు నమ్మకం లేదు!"

"ఎవరిని ఆరాధించాలని ఉందో వాళ్ళకే కదా నమ్మకమూ, భక్తీ కావాలి? దాని మూలం నా మనసుకి బలం కలుగుతోంది. అందులో మీకు అభ్యంతరమా?" అని అడుగుతూ పరమేశ్వరన్ లోపలికి వెళ్ళారు.

' ఇతను చాలా ఆవేశ పడుతున్నారు,' అని సోమనాథన్ తనలో గొణుకున్నారు.

కొంత సమయం తరువాత పరమేశ్వరన్ ఒక తెల్ల పంచె, చేతులు పూర్తిగా కప్పుతున్న చొక్కాయి ధరించి నుదుటపై మెరిసే విభూతితో సోఫాలో మళ్ళీ కూర్చున్నారు. కోధై అతనికి కొంత ముందుకు వచ్చిన ఉత్తరం హార్లిక్స్‌తో అతనికి అందించింది. అతను నెమ్మదిగా అది తాగుతూ ఆ ఉత్తరం చదివారు.

'ప్రియమైన ప్రొఫెసరు పరమేశ్వరన్ కి:

ఇది ఒక అనామధేయ - పేరు చెప్పని ఉత్తరం అని తీసి పారేయడానికి ముందు ఇలాంటి ఉత్తరాలు కూడా సత్యం పలుకుతాయని మీరు అర్ధం చేసుకోవాలి.

మీ జీవితం ఒక పెద్ద అబద్ధం అనే పునాదిపై నిలబడి ఉంది. మీరు పూజ్యులని నమ్మే సోమనాథన్ ఎటువంటి మనిషి అని మీకు తెలియదు. కోధై వంటి ఒక స్త్రీ మీ భార్యగా ఉందని మీరు ఆనందిస్తున్నారు కదా, కాని కోధై గతకాల జీవితం గురించి మీకేమీ తెలియదు. పెళ్ళి అవడానికి ముందే ఆమె ఒక మగవాడి ప్రియురాలుగా గర్భవతి ఐన తరువాత నిరాకరించబడిన ఒక యువతి. దేవుని కృపవలనో, లేక ఆ పెద్ద మనిషి సలహావలనో అది ఒక మృత శిసు జననమైంది. మీ గురువుగారే మిమ్మల్ని మోసగించి ఈ పెళ్ళికి ఏర్పాటు చేసారు. మీరు ఆమెతో సంతోషంగా జీవించగలరు కాని మీరు మిమ్మల్నే మోసం చేసుకోవడం వలనే ఆ సంతోషం . . .'

ఎవరో పేరు తెలుపక రాసిన ఆ ఉత్తరాన్ని అలాగే చింపి పారేయాలని పరమేశ్వరన్ చేతులు శ్రమతో తొందర పడ్డాయి. కాని ఒక క్షణం ఆగి ఏదో తలపుతో ఆ ఉత్తరాన్ని మడిచి తన చొక్కాయి జేబులో దోచుకున్నారు.

'ఏమైనా ముఖ్యమైనా సంగతులా? " అని సోమనాథన్ అడిగారు.

" ఊహూం . . ఇందులో ఏమీ లేదు . ." అని పరమేశ్వరన్ ఒక అబద్ధం చెప్పారు. దాన్ని అలాగే తన మనసులోనుంచి తీసి పారేయాలని అతను ప్రయత్నించారు. అతని చూపు ఆ హాలు గోడపై ఉన్న పటాల మీద; గోడ పక్కనే ఒక చెయిలో సంచికతో దేవతలాగ నిలబడి ఉన్న కోదై మీద, తరువాత తన మౌనం, బాధ, కలత - వీటిని పరిశీలించే ఆ సోమనాథన్ మీద - మారి మారి వాలుతుంటే ఎక్కడ తన మనసులోని ఆరాటం సోమనాథన్ కి తెలిసిపోతుందో అనే భయం అతనికి కలిగింది.

భర్త ముఖం తటాలున కలవరపడడం చూసి కోదై అతని దగ్గరకి వచ్చి "ఏం, మీకు తల నొప్పిగా ఉందా?" అని అడిగింది. "మీ కళ్ళు ఎర్రబడి ఉన్నాయే?" అని అడుగుతూ అతని నెత్తి మీద చెయి పెట్టి చూసింది: "కొంచం జ్వరం అనిపిస్తోంది."

సోమనాథన్ కూడా లేచి వచ్చి నెత్తిమీద చెయి పెట్టి పరమేశ్వరంతో " మరేం లేదు, మీరు అలసిపోయారు . . కొంచం విశ్రాంతి తీసుకోండి . . మనం ఇంకొక వారం తరువాత కలుసుకుందాం . . అప్పుడు నేను రెండు రోజులు ఇక్కడ ఉంటాను," అని చెప్పి బుజాన తట్టారు.

"నాకేం లేదు . . కొంచం బయటకి వెళ్తే బాగానే ఉంటుంది . . నేనూ మీతో స్టేషన్కి వస్తాను . . . టైము ఇంకా ఉంది కదా . . . ఇదో . . ఇప్పుడే వస్తాను . ." అని శ్రమతో నవ్వుతూ, లేచి, పరమేశ్వరన్ అద్దంలో ముఖం చూసుకున్నారు. ఆ తరువాత కొంచం ఒంటరిగా ఉండాలని మేడ మీదకి వెళ్ళి, దాబాలో నిలబడి ఆకాశాన్ని కళ్ళు అప్పగించి చూసారు. జేబులో ఉన్న ఆ ఉత్తరాన్ని ఇంకొకసారి తీసి చదివారు. 'అనామక ఉత్తరాలు కూడా సత్యం పలుకుతాయని మీరు అర్థం చేసుకోవాలి,' ' మీ జీవితం ఒక పెద్ద అబద్ధం అనే పునాదిపై నిలబడి ఉంది,' అనే రెండు వాక్యాలు ఆ ఉత్తరాన్ని నమ్మడమా లేక తిరగగొట్టడమా అని తెలియక అతన్ని చిత్రవధ చేసాయి.

ఉన్నపాటుగా అతను ఆ ఉత్తరాన్ని అడిగారు:

"కానీ, అది నిజమే కానీ. కోదై గతకాల జీవితం గురించి నాకెందుకు ఆరాటం? ఇప్పుడు ఆమె నాకు తగిన భార్య; మేమిద్దరం ఏకక్య దాంపత్యం గడుపుతున్నాం. ఒక తప్పు జరిగితే అందువలన ఒకరి జీవితం నశించిపోవాలా ఏమిటి? " అని పట్టుదలతో అతను అడిగినప్పుడు ఆ ఉత్తరం గాలిలో రెపరెపలాడింది. అతని చేతి వేళ్ళు దాన్ని గట్టిగా అణచి పట్టుకున్నాయి. వేళ్ళని కొంచం విప్పి ఉంటే అది గాలిలో ఎగిరిపోయుంటుంది, కాని అవి దాన్ని అడిమి పట్టుకున్నాయి. ఆ ఉత్తరాన్ని తునకలు తునకలుగా చింపి పారేయాలని ఒక వెర్రితనమూ, అదే సమయం అలాగే మీ చెయాకూడదనే పట్టుదల అతనిలో పుట్టాయి.

"ఈ ఉత్తరం నా భార్య గురించి నాకు చెప్తోంది. ఇది చెప్పేది నిజమైనా, అబద్ధమైనా మా బంధుత్వానికి ఏ హానీ రాదు. అవును, కోదై లేకుండా నేను జీవించలేను. ఇందకు ముందు జరిగిన సంఘటన గురించి నాకేం కలత లేదు," అని దృఢమైన మనసుతో అతను తల ఎత్తి చూసారు. కాని మరు క్షణమే అతని నుదుట మీద మడతలు పడ్డాయి; కళ్ళు ఇరుక్కున్నాయి. రహస్యంగా ఒక కఠధ్వని అతనిలో వినిపించింది:

'కాని ఏం జరిగిందో తెలియాలి కదా? ఏది నిజం అని నాకు తెలియవద్దూ?' అనే ప్రశ్న పిసి అతని మనసు అవమానంతో కూలిపోయింది. "ఛీ, ఛీ, నాకెందుకు ఈ అల్ప బుద్ధి? ఎవరో పలుగాకి రాసిన ఈ ఉత్తరం నన్ను ఎందుకు ఇలా నిలకడ లేకుండా చేసింది?" అని తన్నే నోచుకుంటూ అతను ఆ ఉత్తరాన్ని చింపారు. పరమేశ్వరన్ ఆ ఉత్తరాన్ని చింపుతుంటే సగంలో అతని చేతులు ఆగాయి. ఉత్తరం సగం భాగంలో ఒక పావు చిరిగి ఉంది. అందులో . .

'అనామక ఉత్తరాలు కూడా సత్యం పలుకుతాయని . . . " అనే వాక్యం మళ్ళీ అతను చూసారు . . .

"హూం, అలాగా? నువ్వు చెప్పేదంతా అసూయవలనే అని తెలిసిన తరువాత నేనూ, కోదై కలిసి నిన్ను పూర్తిగా చింపుతాం; లేకపోతే ఈ గతకాల సంఘటన మా జీవితం నుంచి వెళ్ళిపోవాలని ఆ జ్ఞాపకాన్ని కాలుస్తాం, " అని పరమేశ్వరన్ శపథం చేసుకున్నారు.

"ఐతే ఆ నిజాన్ని ఎలాగ గ్రహించడం? ఈ ఉత్తరం చెప్పేది నిజం కాదని ఋజువు చెయ్యడానికే అతను ఇప్పుడు వచ్చారా?" అనే తలపుతో పరమేశ్వరన్ త్వరగా మెట్లు దిగి కిందకి వచ్చారు.

ఒక టాక్సీలో స్టేషన్ కి ప్రయాణం చేస్తున్నప్పుడు పరమేశ్వరన్ తన మౌనం పగులగొట్టి మాట్లాడారు:

"మీకు బాగా తెలుసు; నేనూ కోదై మీ ఆశీర్వాదం వలన పవిత్రమైన జీవితం గడుపుతున్నాం . . ." అని అంటూ తన జేబులోనుంచి ఆ ఉత్తరం బయటకు తీసారు.

సోమనాధంకి ఒకటే ఆశ్చర్యం.

పరమేశ్వరన్ టాక్సీలో ఉన్న ఒక చిన్న మీటను నొక్కి ఆ వెలుతురులో ఆ ఉత్తరం చూపిస్తూ పలికారు: " మీరు డొంకతిరుగుడుగా కాకుండా 'ఇది నిజం, లేక ఇది అబద్ధం,' అని రెండులో ఒకటి చెప్తే చాలు. మీరు చెప్పే సత్యం - అది ఎలాగ ఉన్నా - అది ఎవరినీ బాధించదు . ." అని అతను ఆ ఉత్తరం అందించినప్పుడు అతని చేతులు వణకడం సోమనాధన్ గమనించారు.

తరువాత నిదానంగా ముఖంలో ఎటువంటి చలనమూ లేకుండా చిరిగిన ఆ సగం ఉత్తరాన్ని సోమనాధన్ చదివారు. ఆ ముఖాన్ని రెప్పలార్చకుండా చూస్తున్న పరమేశ్వరన్ "నాకు నిజం ఏమిటని తెలియాలి . . ." అని గాభరాతో పలికారు.

సోమనాధన్ అతన్ని చూసి ఒక పసిపాపలాగ నవ్వారు. ఆ నవ్వు 'నాకు నీ బలహీనత నిజం తెలుసుకొనే ఆతృతలో అర్ధమైంది,' అని అన్నట్టుంది.

సోమనాధన్ పరమేశ్వరన్ ని మెమ్మదిగా తాకి సమాధానం చెప్పారు: " మీరు ఇంతగా ఆవేశపడతారు అని నేను ఎదురుచూడలేదు. ఇది మీ ఆరోగ్యాంకి మంచిది కాదు . . ఇలా ఉంటే మీకు blood pressure వచ్చేస్తుంది."

"నాకు నిజం తెలియాలి . . నేను దాన్ని వెదకడంవలనే ఇలా బాధ పడుతున్నాను."

"నిజాన్ని వెదుకుతున్నారా? అది అన్నీ త్యాగం చేసిన జ్ఞానుల పని కదా?" అని చెప్పి సోమనాధన్ నవ్వారు.

పరమేశ్వరన్‌కి ఆ పిల్లతనపు మాటలు విని సోమనాధన్ మీద కొంచం కోపం కూడా వచ్చింది. మరేం అనకుండా ఊరుకున్నారు.

"మిస్టర్ పరమేశ్వరన్, ముందు ఈ ఉత్తరం రాసిన వ్యక్తి గుణం నీచమని మీరు గ్రహించాలి . . ." అని సోమనాధన్ ఇంకా ఏమో చెప్పబోతుంటే పరమేశ్వరన్ దానికి అడ్డుగా, మొండిగా, అడిగారు: " దీని గురించి నాకు మీ జవాబు ఒక మాటలో కావాలు: నిజమా లేక అబద్ధమా?"

ఆ కంటధ్వనిలో ఉన్న మూర్ఖమైన పట్టుదల, అతని మనసు అర్థం చేసుకొని. " ఒక మాటలో మీకు జవాబు కావాలా?" అని సోమనాధన్ పరమేశ్వరన్ ముఖం చూస్తూ అడిగారు.

"అవును, ఒకే ఒక మాట. మీ జవాబుని నేను తప్పకుండా నమ్ముతాను."

ఒక పిల్లవాడో లేక ఒక తాగుబోతో ఇచ్చే మాటలాగ దాన్ని భావించి సోమనాధన్ నమ్మకం వదలుకొని మళ్ళీ నవ్వారు.

"నాకు మీ అవస్థ చూసి చాలా బాధగా ఉంది. ఈ ఉత్తరం వలన మీలో ఇంత మార్పు రావడం . . . ఇక నా జవాబు ఒకే మాటలో చెప్తాను, వినండి. ఇది అబద్ధం!" అని పెదిమలు అదురుతూ సోమనాధన్ ఆ ఉత్తరం అతనికే తిరిగి ఇచ్చేసారు.

ఆ తరువాత వాళ్ళిద్దరూ ఏమీ మాట్లాడలేదు.

సోమనాధన్ని ట్రెయిన్ లో సాగనంపినప్పుడు కూడా అతను పరమేశ్వరన్ దగ్గర ఆ ఉత్తరం గురించి అబద్ధం అనే మాట తప్ప మరేం చెప్పలేదు.

కాని పరమేశ్వరన్ కి సోమనాధన్ తనకు చెప్పిన మాటల్లో ఆ అబద్ధం అనే పదమే అబద్ధమని తోచింది. ఆ తలపు వచ్చిన వెంటనే అతను తన్నే నోచుకున్నారు.

" ఈ ఉత్తరం నన్ను ఎంత అల్పుడుగా మార్చేసింది! నేను దాని గురించి అతనితో మాట్లాడినది నా తప్పు. అతను నా గురించి ఏమనుకున్నారో? " అనే కలవరపడుతూ పరమేశ్వరన్ ఇంటికి తిరిగి వచ్చారు.

అతను ఇంట్లోకి ప్రవేశించినప్పుడు కోద్దై మేడమీద తన గదిలో ఉంది. మామూలుగా అటువంటు సమయం పరమేశ్వరన్ మేడమీద తిన్నగా వెళ్తారు. కాని ఇవాళ హాలులోనే కూర్చొని గోడపై ఉన్న పటాల మీద కళ్ళు అప్పగించి చూసారు.

అతను మేడ మీదకి రాకపోవడంతో కోద్రై కిందకి దిగి వచ్చింది.

" ఏమైంది మీకు? " అని అతని నెత్తి మీద చెయి పెట్టి చూసింది. " జ్వరం లేదు." పరమేశ్వరన్ గభీమని ఆమె చెయిని పట్టుకున్నారు.

" ఏమైంది, మీకు?" అని ఉలికిపడి కోద్రై అతని ముఖం చూడగానే అతని పెదిమలు అదిరాయి; ఏడుపు వచ్చేస్తున్నట్టుంది. అతని మనసులో ఒక ఆశ కూడా కలిగింది. " నేను ఒక మూర్ఖుడని. ఇదిగో, ఇక్కడ నా పక్కనే సత్యస్వరూపిణిగా నా భార్య ఉంది. ఆమెకి ఈ ఉత్తరం చూపి నిజం తెలుసుకోవచ్చు కదా? నేనెందుకు ఇలా బాధ పడాలి?"

పరమేశ్వరన్ ముఖంలో ఒక కాంతీ, ఉల్లాసమూ కనిపించాయి. " నాకేం లేదు . . ఇలాగ రా . . ఇక్కడ పక్కనే వచ్చి కూర్చో . . నాకొక ప్రశ్న . . అది నువ్వే తీర్పగలవు . . నీకు నన్ను బాగా తెలుసు . . నువ్వు లేకుండా నేను జీవించలేను . . ". గభీమని అతను ఉక్కిరి బిక్కిరి ఐపోయారు. "ముందు ఈ ఉత్తరం చదువు . . తరువాత అరమరిక లేకుండా ఈ ఉత్తరంలో చెప్పినది నిజమా అబద్ధమా అని చెప్పు. అది చాలు. నీ జవాబు ఎలా ఉన్నా అది ఎవరినీ బాధించదు . . నేను నీకు మాట ఇస్తున్నాను . . నాకు నిజం ఏమిటో తెలియాలి . నా జీవితానికి ఆధారమైనది అబద్ధం కాదు అని నాకు తెలియాలి," అని అతను చెప్తూంటే కోద్రై ఆ ఉత్తరం నిదానంగా చదివి, మనసు దృఢపరచుకొని వినయంతో చెప్పింది: "నిజం."

పరమేశ్వరన్ అలాగే స్తంభించి పోయారు. ఆమె నిష్పటమైన ద్వనితో ఇంకా చెప్పింది:

"అది నా జీవితంలో ఒకానొకప్పుడు జరిగిన తప్పు; అందుకోసం నేను ఎవరినీ నిందారోపణం చెయ్యను. ఇక నా జీవితం నశించిపోయిందని ఇక అలాగే జీవించాలని నిశ్చయం చేసుకున్నాను; అది సరి కాదని మామయ్య అనేవారు. అలాంటి సందర్భంలోనే నేను మీతో పెళ్ళికి ఒప్పుకున్నాను.

మామయ్య అనేవారు: 'ఒక అబద్ధానికి మనం ప్రాణం పొయ్యకూడదు. గతకాల సంగతులు గతకాలంతోనే ఉండనీ. నిజం చెప్పే వంకలో మనం ఇంకొక అబద్ధానికి ప్రాణం పొయ్యవద్దు. నిజం నిప్పులాగ; దాన్ని భరించడానికి పరిపక్వత కావాలి. మరి నిప్పు ప్రకృతి అదేకదా? దాన్ని భరించడానికి అందరికీ సాధ్యం కాదు,' అని అతను అనేవారు. ఈ ఉత్తరంలో రాసినట్టు మిమ్మల్నో లేక మరెవరినో మోసగించాలనే ఆలోచన ఎవరికీ లేదు. నేను మీ భార్య. ఇది తెలిసిన తరువాత మీ దగ్గర ఏమీ దాచకూడదని అంతా చెప్పేసాను. ఈ నిజం మిమ్మల్ని కాల్చివచ్చు; అది నాకు తెలుసు. దాన్ని భరించడానికి తగిన బలం మీకు ఉంది . . ." అని కొద్రై చెప్తూంటే పరమేశ్వరన్ ధారధారగా కన్నీరు కార్చారు. ఇప్పుడు కోద్రై మాటలు విని, అదిరిపడి .సోమనాధన్ అబద్ధం వలన తనకు ద్రోహం చేసి తన గుండెని కాల్చివేసారని అరిచారు. " కోద్రై, నేను నిన్ను క్షమించగలను. కాని ఒక గంట ముందు నేను ఈ ఉత్తరం చూపి అడిగినప్పుడు సోమనాధన్ మనసార అబద్ధం చెప్పారే . . .ఆ పెద్ద మనిషి చేసిన ద్రోహం నేను క్షమించలేను .. . ." అని సోఫాలో నుంచి లేచి పరుగెత్తారు. గోడపై ఉన్న పటాల్ల వరుసలో ఉన్న తన అభిమానంకీ, ప్రేమకీ అర్హుడైన సోమనాధన్ పటాన్ని తీసి పారేసారు.

అది హాలు మూలన ఎక్కడో పడింది. "ఛీ,ఛీ, వీడేమో పెద్ద మేధావి, జ్ఞాని అంట!" అని తనలో గొణుక్కుంటూ పరమేశ్వరన్ మేడ మీదకి పరుగెత్తారు.

అతను తన గదికి వెళ్ళి తలుపు తటాలున మూయడం కోదై కి వినిపించింది.

'సరే, నిజం అతన్ని కాల్చేసింది,' అని కోదై మనసులో చెప్పుకుంది.

దిగ్భ్రమతో, ఇక ఈ లోకంలో బయటకి తళుకు బెళుకుగా కనిపించే కుయుక్తి, టక్కరి, మోసంలో, విరక్తి చెంది, ఎవరినీ చూడడానికి ఇష్టం లేక ఒంటరిగా పరమేశ్వరన్ మంచం మీద ఒక శవం లాగ వాలారు.

అప్పుడు ఎవరో మెల్లగా తలుపు తట్టారు.

అది విని పరమేశ్వరన్ అలాగే కదలకుండా లోకప్పు చూస్తూ పడుకున్నారు. మళ్ళీ తలుపు తట్టబడుతుందని ఎదురు చూసారు. కాని అలాగేమీ జరగకపోవడంతో తనే లేచి వెళ్ళి తలుపు తెరిచారు.

అక్కడ చెయిలో ఒక చిన్న పెట్టెతో అతనికి వీడుకోలు చెప్పడానికి కోదై వచ్చి నిలబడింది. కొన్ని క్షణాలు ఇద్దరూ దీర్ఘంగా ఒకరినొకరు చూసుకున్నారు. కోదై సువ్యక్తంగా మాట్లాడింది. " మీకు మామయ్యపై అర్ధం లేని భక్తి అని నేను అనుకునేదాన్ని. కాని మీరు ఆ పటాన్ని తీసి పారేసిన తరువాతే అతను పెద్ద మేధావి, జ్ఞాని అని నాకు బుజువయింది. అతను మానవ హృదయంలోని గూఢమైన, అజ్ఞాత రహస్యాలు అర్థం చేసుకున్న మహనీయులు. ' నిజం నిప్పు లాగ, ' అని నాకు చెప్పిన ఆ మేధావికి మీరు నిజం భరించలేరు అని బాగా తెలుసు. మీరు చెప్పారుగా మీరు నన్ను క్షమించగలరు అని. అంటే మీరే మిమ్మల్ని మోసం చేసుకుంటునారన్న మాట. నేను చేసినది తప్పంటే దానికి మీరు నన్నుకదా శిక్షించాలి? కాని అది మీకు చేతకాదు; మీ హృదయానికి ఆ బలం లేదు. ఐతే దీనికి మీరు ఎవరినైనా శిక్షించి తీరాలి. అందువలనే ఒక తల్లి దగ్గర దెబ్బ తిన్న అబ్బాయి తన చెల్లెల్ని గిల్లినట్టు ఉంది మీ వైఖరి. అది మీ బలహీనత; స్వార్ధం కోరి మీరు చేసే పని. ఇక మన ఇద్దరం కలిసి ఉంటే అది మన ఇద్దరికీ ఒక శిక్ష లాగ. నాకు మీపై ఎటువంటి విచారమూ లేదు. ' నిజం నిప్పు లాగ ' అని నాకు బోధించిన ఆ మహనీయుల దగ్గరకి వెళ్ళి ' మీరు అన్నారుగా నిజం నిప్పు లాగ అని? ఆ నిజం కొందరిని కాల్చి వేస్తుందని తెలియక నేను ఒకరిని కాల్చి వేసి ఇప్పుడు వచ్చేసాను ' అని మీ దగ్గర క్షమాపణ కోసం వచ్చాను . ." అని చెప్పి కోదై అతని జవాబు ఎదురు చూడక మెట్లలో దిగి వెళ్లడం పరమేశ్వరన్ గమనించారు.

"నిజం వెతుకుతున్నారా? అది అన్నీ త్యాగం చేసిన జ్ఞానుల పని కదా?' అని సోమనాథన్ తమాషాగా చెప్పిన మాటల్లోని అర్ధం ఏమిటని పరమేశ్వరన్ ఇప్పుడు ఆలోచించారు.

అది ఆలోచన కాదు; అది ఒక దిగ్భ్రమ. తరువాత ఒక చిరునవ్వు నవ్వారు. అది చిరునవ్వు కాదు. అది ఒక శరణాగతి.

త్వరగా మెట్లు దిగి అతను కిందకి వచ్చారు.

అప్పుడే కోద్రై ద్వారం దగ్గర తలుపు తెరిచి నిలబడి ఉంది.

"కోద్రై!" సుస్వరమైన అతని పిలుపు విని ఆమె తిరిగి చూసింది.

అక్కడ . .

గోడపై ఖాళీగా ఉన్న ఆ జాగాన్ని తనకు పూజ్యులూ, మార్గదర్శి ఐన సోమనాథన్ పటంతో పరమేశ్వరన్ మళ్ళీ అలంకరించారు.

పరమేశ్వరన్ తన జీవితానికి ఒక పునాది అని తను భావించిన ప్రశ్నలో అబద్ధం చెప్పిన సోమనాథన్ని తిరిగి తన గురుగా స్వీకరించగలరు అంటే అదే ప్రశ్నలో నిజం పలికిన కోద్రైని అతను నిరాకరించగలరా ఏమిటి?

*********